షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు      తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152



1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
THE POWER OF PEN RK



సంపుటి : 3 సంచిక : 52 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 22 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 52 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 22 February 2026 PAGES : 8 PRICE : 3/-


## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు.. నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

### పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 21)

జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ▶మిగతా 2లో

## భారత్-బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 21)

భారత్ పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. కీలక ఖనిజాలు, భద్రతా అంశాలపై దృష్టిపెట్టిన ఇరువురు నేతలు.. బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ▶మిగతా 2లో

## ఏఐ ఇంపాక్ట్ సమిట్‌తో 250 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులకు హామీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 21)

భారత్ ఆధ్వర్యంలో దిల్లీ వేదికగా జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌తో మౌలిక వసతుల రంగంలో 250 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులకు హామీలు లభించాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వీసీ/డీప్‌టెక్ సాంకేతికతలపై 20 బిలియన్ డాలర్ల మేర వ్యయం చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారనీ పేర్కొన్నారు. ఈ శిఖరాగ్ర సదస్సులో 5 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారని వెల్లడించారు. సమిట్ దిల్లీ డిక్లరేషన్‌పై 70కిపైగా దేశాలు ఇప్పటికే సంతకాలు చేశాయన్నారు. ఈ సంఖ్య 80 దాటే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తుది సంఖ్యను శనివారం వెల్లడిస్తామన్నారు. కృత్రిమ మేధ అంశంలో ప్రధానమైన దేశాలన్నీ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయని తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్
- ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్టాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి
- దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 21)

ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ ▶మిగతా 2లో

## దేశంలో ఏ రాష్ట్రం ఏపీకి దరిదాపుల్లో లేనంత

# సంక్షేమాన్ని అందిస్తున్నాం

- ▶పల్నాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ▶ఘన వ్యర్థాల సేకరణ కోసం స్వచ్ఛ రథాన్ని, ఈ-ఆటోలను ప్రారంభించిన చంద్రబాబు
- ▶సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని ఉద్ఘాటన
- ▶ప్రజలకు మెరుగైన జీవనం అందిస్తామని హామీ
- ▶561 స్వయం సహాయక సంఘాలకు రూ. 100.14 కోట్ల చెక్కు అందజేత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 21)

సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఏ రాష్ట్రం కూడా ఏపీకి దరిదాపుల్లో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ రథాన్ని', ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.

**దేశంలోనే ఏపీ అగ్రగామి :** ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం" అని వివరించారు.

**మహిళా సాధికారత, ప్రజల భాగస్వామ్యం :** మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్‌ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ▶మిగతా 2లో


## ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన భారత సంతతి లాయర్.. ఎవరీ నీల్ కత్యాల్..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 21)

తన, పర భేదం లేకుండా టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ఆ సుంకాలేవీ చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు రావడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున ఆయన సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈ టారిఫ్‌ల కోసం ట్రంప్ 1977 నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఈఈపీఏ) ఉపయోగించడానికి వ్యతిరేకంగా నీల్ కత్యాల్ సుప్రీంకోర్టులో వాదించారు. ప్రతి వాణిజ్య భాగస్వామి పైనా సుంకాలు విధించడం అన్యాయమని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంతీర్పు అనంతరం నీల్ మాట్లాడుతూ.. "ఈ రోజు అమెరికా సుప్రీంకోర్టు చట్టపరమైన పాలన, అమెరికన్ ప్రజల భద్రత కోసం నిలబడింది. అధ్యక్షులు శక్తిమంతులే.. కానీ రాజ్యాంగం మరింత శక్తిమంతమైనదని న్యాయస్థానం నిరూపించింది. ప్రాథమిక విలువలను కాపాడింది. ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలవనుంది" అని ఆనందం వ్యక్తం చేశారు. ▶మిగతా 2లో

## ట్రంప్ టారిఫ్‌లు రద్దు.. భారతీయులకు రీఫండ్ వస్తుందా?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 21)

భారత్ సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని అమెరికా సుప్రీంకోర్టు తేల్చేసింది. మరి ఇప్పటివరకు చెల్లించిన సుంకాల మాటేంటీ? ఇప్పుడు అందరిలో మెదిలే ప్రశ్న ఇదే..! ఈ విషయాన్ని కోర్టు కూడా తన తీర్పులో స్పష్టం చేయకపోయేసరికి దీనిపై గందరగోళం నెలకొంది. మరి టారిఫ్‌ల పేరుతో గతేడాది నుంచి అగ్రరాజ్యం వసూలుచేసిన సొమ్మును తిరిగిచ్చేస్తారా? ఒకవేళ అలా చేస్తే భారత ఎగుమతిదారులకు రీఫండ్ ఏమైనా వస్తుందా? ఈ తీర్పుతో భారతీయ కంపెనీలకుఊరట లభించనుందా?

**ఖజానాకు రూ.12లక్షల కోట్లు**

గతేడాది ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2న ప్రపంచదేశాలపై ఈ ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. నాటినుంచి డిసెంబరు మధ్య వరకు దిగుమతిదారుల నుంచి అదనపు సుంకాలు వసూలుచేయడం ద్వారా అమెరికాఖజానాకు 13,300 కోట్ల డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.12 లక్షల కోట్లు) చేరాయని అంచనా. ఈ మొత్తాన్ని ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా, వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అయితే, ఇప్పటికే చాలా కంపెనీలు దీనిపై దిగువ కోర్టులను ఆశ్రయించాయి. కాస్ట్‌కో, రెవ్లాన్, బంబుల్ బీ ఫుడ్స్ వంటి కంపెనీలు రీఫండ్‌ల కోసం పిటిషన్లు దాఖలు చేశాయి. ▶మిగతా 2లో

## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా: జగన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 21)

మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా తన స్నేహితుడు గౌతమ్ రెడ్డిని వైసీపీ అధినేత జగన్ స్మరించుకున్నారు. ఎక్స్ వేదికగా భోవోద్వేగంతో కూడిన పోస్టును పెట్టారు. మన స్నేహాన్ని, జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఒక స్నేహితుడిగా, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతావని ట్వీట్ లో పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డితో జగన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారనే విషయం తెలిసిందే. 2022 ఫిబ్రవరి 21న గౌతమ్ రెడ్డి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐసీయూలో దాదాపు 90 నిమిషాల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదు.

## కార్టూనిస్ట్ శ్రీధర్ కు కేబినెట్ ర్యాంక్ పదవిని కట్టబెట్టిన ఏపీ ప్రభుత్వం


- ఏపీ ప్రభుత్వ సలహాదారుగా శ్రీధర్ నియామకం
- సమాచార ప్రచార విభాగం సలహాదారుడిగా శ్రీధర్
- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 21)

తెలుగు పాఠకులకు ఈనాడు కార్టూన్ల ద్వారా బాగా పరిచితులైన మాజీ కార్టూనిస్ట్ పోచంపల్లి శ్రీధర్ రావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేబినెట్ ర్యాంక్ పదవిని కట్టబెట్టింది. ప్రభుత్వ సలహాదారుగా (సమాచార ప్రచార విభాగం) ఆయనను ఏపీ ప్రభుత్వం ▶మిగతా 2లో

## కాంగ్రెస్ ప్రోత్సహించింది.. భాజపా నివారించింది



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 21)

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం రెండో దశ దేశవ్యాప్త ఉజ్వల గ్రామ పథకం (వీవీపీ) అస్సాం నుంచి ప్రారంభించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో ఆయన రెండు రోజుల పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తన పాలనా కాలంలో దేశంలోకి చొరబాట్లను నిరోధించడంలో విఫలమైందని ఆరోపించారు. వీవీపీ పథకం సరిహద్దు ప్రాంతాల నుంచి వలసల్ని నిలువరించి చొరబాట్లను నివారిస్తుందని అన్నారు. దేశ సరిహద్దులోని గ్రామాల అభివృద్ధికి ప్రధాని మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రెండో దశ వీవీపీ పథకం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల సరిహద్దుల్లో ఉన్న 17 జిల్లాల్లోని 1954 గ్రామాలకు వర్తిస్తుందన్నారు. నాథన్‌పుర్ గ్రామంలో ఒక బహిరంగసభలో మాట్లాడుతూ ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దేశ సరిహద్దుల్ని బార్లా తెరిచి అస్సాంలోకి చొరబాట్లను ప్రోత్సహించిందని అన్నారు. ఈ సమస్యను సీఎం హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం ప్రభావవంతంగా పరిష్కరించిందని పేర్కొన్నారు. అస్సాంను గతంలో పాలించిన కాంగ్రెస్ ఎలాంటి అభివృద్ధి పథకాలనూ ప్రవేశపెట్టలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిరోజూ 14 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. భాజపా ప్రభుత్వం చొరబాట్లను, హింసను, ఉగ్రవాదాన్ని నిలువరించిందన్నారు. అనంతరం అమిత్ షా నాథన్‌పుర్ గ్రామ సమీపంలోని బంగ్లాదేశ్ సరిహద్దును పరిశీలించారు. సరిహద్దులో ఒక మర్రి మొక్కను నాటారు.

## పీఆర్సీ సాధన ఉద్యమాలకు సిద్ధం కావాలి



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 21)

12వ పీఆర్సీ సాధన కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ చింతంరెడ్డి రామచం ద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఛలో విజయవాడ ఉద్యమ శంఖారావ కరపత్రాన్ని విడుదల చేశారు. ఇందులో భాగంగా 12వ వేతన సవరణ అమలుకు ఇప్పటికే 32 నెలలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాగాన్ని సమర్థంగా నడిపిస్తున్న ఉద్యోగాలల సంక్షేమాన్ని కా పాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దు మెరుగైన పెన్షన్ విధానం ప్రవేశపెడతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతను నిర్ధారించకపోతే ఇకపై ఉద్యమాలలోనే తేల్చుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు శివరాజు, జకరయ్య, రామసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షురాలు భారతి, తదితరులు పాల్గొన్నారు.

## కోటవీధిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహణ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 21)

పట్టణంలోని కోట వీధిలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. "జీరో లిట్టర్ గవర్నెన్స్" కార్యక్రమం ద్వారా రోడ్లు, మార్కెట్లు, ప్రజా ప్రదేశాలు చెత్త రహితంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరామిరెడ్డి, మెప్మా సిఎంఎం కళ్యాణ్ బాబు, సిఓ ప్రసన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రమణయ్య, ఇంచార్జి టిఓబీఓ నరసయ్య, ఆర్పీలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 21)

"స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమం శనివారం బద్వేల్ మండలంలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టాయిలెట్లు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో చెట్లను నాటడం, పరిసరాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేయించి, వైద్య సిబ్బంది మరియు శానిటేషన్ కార్మికులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. "మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, చెడిపోయిన సెల్‌ఫోన్లు వంటి ఈ-వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ కాల్చకుండా, సరైన విధానంలో సేకరించి నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

### దేశంలో ఏ రాష్ట్రం ఏపీకి దరిదాపుల్లో లేనంత

# సంక్షేమాన్ని అందిస్తున్నాం

ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.

**టెక్నాలజీతో సుపరిపాలన**

పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.

**ఆరోగ్యానికి భరోసా, వ్యవసాయానికి చేయూత**

ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

**స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పటిష్ట చర్యలు**

స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.

**చెత్త నుంచి సంపద.. మారాల్సిన తీరు**

చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుం టూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవి కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ టారిఫ్‌లు రద్దు.. భారతీయులకు రీఫండ్ వస్తుందా?

**చెల్లింపులు కంపెనీలకే..!** ట్రంప్ భారీ సుంకాలతో భారత ఎగుమతిదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా కొన్ని పరిశ్రమలకు అగ్రరాజ్యం నుంచి వచ్చే మార్కెట్ వాటా తగ్గింది. అయితే, తాజా తీర్పుతో భారత ఎగుమతిదారులకు ఎలాంటి రీఫండ్ దక్కే అవకాశాలు లేవు. ఎందుకంటే ఈ టారిఫ్‌లను చెల్లించింది అమెరికాలోని దిగుమతిదారులే. ఒకవేళ సొమ్ము వెనక్కిచ్చేస్తే అది ఆయా కంపెనీలకే వెళ్తుంది. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా భారత ఎగుమతిదారులకు జరిగిన నష్టానికి అమెరికా ఎలాంటి పరిహారం చెల్లించబోదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ తీర్పుతో అగ్రరాజ్య మార్కెట్‌లో మన ఉత్పత్తులకు మళ్లీ గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ అమెరికాలో భారత కంపెనీలు ఏమైనా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంటే.. వారికి కొంతమేర లబ్ధి చేకూరనుంది. ఇక, అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని భారత్ పునఃసమీక్షించుకునేందుకు ఈ తీర్పు దోహదపడనుంది.

**రీఫండ్లకు 12-18 నెలల పైనే..** అయితే, టారిఫ్‌ల సొమ్ము తిరిగి దిగుమతిదారులకు చెల్లించడం అనేది సులువైన ప్రక్రియ కాదు. దీనివల్ల గందరగోళ పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. రీఫండ్‌ల కోసం అమెరికా వద్ద ప్రత్యేక ఆటోమేటిక్ వ్యవస్థ అంటూ ఏదీ లేదు. కంపెనీలే చట్టబద్ధంగా దీనిపై దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని అగ్రరాజ్య మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ అందుకు కోర్టులు అనుమతినిస్తే.. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెన్సీ వాటిని సమీక్షించి చెల్లింపులు చేపట్టే అవకాశం ఉంది. అయితే, అది చాలా సుదీర్ఘ ప్రక్రియ. దాదాపు 12-18 నెలలు పట్టొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 'రీఫండ్ వ్యాజ్యాలన్నీ పూర్తయ్యేసరికి రెండేళ్లు పట్టొచ్చు' అని ట్రంప్ కూడా విలేకరులతో అన్నారు. గతంలోనూ ట్రేడ్‌కు సంబంధించిన కేసుల్లో కంపెనీలకు అమెరికా సొమ్ము తిరిగి చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. ఎగుమతులపై హార్బర్ మెయింటినెన్స్ ఫీజు రాజ్యాంగవిరుద్ధమని 1990ల్లో పలు కోర్టులు తీర్పునిచ్చాయి. ఆయా ఎగుమతిదారులు చెల్లించిన ఫీజులను రీఫండ్ చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటుచేయాలని న్యాయస్థానాలను ఆదేశించాయి. దానికి అనుగుణంగా యూఎస్ కస్టమ్స్ అధికారులు రీఫండ్ ప్రక్రియ చేపట్టారు. అయితే, ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి ఎన్నడూ రిఫండ్ చేయలేదు. మరి ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చెల్లింపులపై అమెరికా ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే..!

## భారత్-బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు

లాటిన్ అమెరికాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ ఉందని ప్రధాని మోదీ (గ్రావీ వీశీఱఱ) పేర్కొన్నారు. లూలా స్ఫూర్తిదాయక నాయకత్వం, దార్శనికతతో ఇరు దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని, ఇది విన్-విన్ భాగస్వామ్యమని అభివర్ణించారు. ఈ రెండు దేశాలు కలిసి పనిచేస్తే.. దక్షిణార్ధ గళం మరింత బలపడుతుందన్నారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చేవారు మానవాళికి శత్రువులని ఈ రెండు దేశాలు అంగీకరిస్తున్నాయని చెప్పారు.

**ఇక ఇజ్రాయెల్ బాణంతో భారత్ గురి..?**

గతేడాది జులైలో ప్రధాని మోదీ బ్రెజిల్‌లో పర్యటించడం ఇరుదేశ సంబంధాల్లో ఓ మైలురాయి అని సిల్వా పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు రంగాల్లో ద్వైపాక్షిక సహకార అజెండాను పునర్నిర్మించుకున్నామని, తాజాగా ఇరు దేశాల భాగస్వామ్యానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఐటీ, ఏఐ, బయోటెక్నాలజీ, అంతరిక్ష ప్రయోగాలు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ఎంతో పురోగతి సాధిస్తోందని, ఇవి బ్రెజిల్‌కు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన భారత సంతతి లాయర్.. ఎవరీ నీల్ కత్యాల్..?

**ఎవరీ నీల్ కత్యాల్..** నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. తల్లి ప్రతిభ వైద్యురాలు. తండ్రి సురేందర్ ఇంజినీర్‌గా పనిచేశారు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. కెరీర్ తొలినాళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద క్లర్క్‌గా పనిచేశారు. 2010లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులు వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలు ఉన్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. సంచలనం సృష్టించిన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్య కేసులో మిన్నెసోటా రాష్ట్రం తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా వాదించారు. అమెరికా న్యాయవిభాగం నుంచి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు.

## కార్టూనిస్ట్ శ్రీధర్ కు కేబినెట్ ర్యాంక్ పదవిని కట్టబెట్టిన ఏపీ ప్రభుత్వం


నియమించింది. ఈ నియామకానికి సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీధర్ రావు రెండేళ్ల పాటు ప్రభుత్వ సలహాదారుగా ఉంటారు. కేబినెట్ మంత్రి స్థాయిలో ఆయనకు జీతభత్యాలు, అలవెన్సులు వర్తిస్తాయి. 'ఈనాడు' దినపత్రికలో తన మార్క్ కార్టూన్లతో గుర్తింపు పొందిన శ్రీధర్ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెడుతున్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై తన కార్టూన్లతో ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న ఆయనకు ఇప్పుడు ప్రభుత్వ సలహాదారుగా అవకాశం లభించడం విశేషం.

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు.. నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వారధులుగా నిలవాలి

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
### పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులు అందజేసిన మంత్రి స్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వారధులుగా నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో గ్రేడ్ 2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న 8 మందికి గ్రేడ్ 1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గా పదోన్నతి లభించింది. వారికి పదోన్నతి ఉత్తర్వులను శనివారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో వారికి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ పదోన్నతి అంటే కేవలం హోదా పెరగడం కాదు, బాధ్యత పెరగడం. సాంఘిక సంక్షేమ శాఖకు మీ పనితీరు ద్వారా మంచి పేరు తీసుకురావాలి. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు మీరే తల్లిదండ్రులు. వారి చదువు, ఆరోగ్యం మరియు మెనూ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు. పేదరికం కారణంగా హాస్టళ్లలో ఉండి చదువుకునే పిల్లలు రేపటి సమాజానికి ఆదర్శంగా నిలవాలి. వారి వ్యక్తిత్వ వికాసం కోసం మీరు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్, కందుకూరు లింగయ్య, ప్రకాశం జిల్లా హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ డి అంకబాబు, ఆఫీస్ సూపరెంటెంట్ మాల్యాద్రి, సీనియర్ అసిస్టెంట్ మాలకొండయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**పదోన్నతి పొందిన వారి వివరాలు**

డి దుర్గాలక్ష్మి (ఒంగోలు), కె శ్రీలత (ఒంగోలు), కె స్వప్నలత (ఒంగోలు), ఎన్ అరుణ కుమారి (కొత్తపట్నం), సిహెచ్ శ్రీనివాసులు (గుడ్లూరు), ఎన్ ప్రభుదాస్ (బి నిడమానూరు), జె సుమన్ శాస్త్రి (కేవీ పల్లి), ఎం హరిబాబు (పొదిలి).





# పేదల ఆదాయం పెంచుతాం... ఆనందాన్ని పంచుతాం

- సంక్షేమం అమలులో ఏపీకి దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ రాదు
- మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ
- ఢిల్లీ ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం
- చెత్త విషయంలో జపాన్ తరహాలో అలవాట్లు మార్చుకోవాలి
- వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 21)

పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని, ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

### పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు

వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవిన విధానంలో భాగం కావాలి అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

### పరిసరాల శుభ్రత.. మన బాధ్యత

రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామాలు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్ గార్డెన్లు ఉన్నాయి. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో రూ.1,254 కోట్లతో పీపీపీ విధానంలో 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15కల్లా వినియోగంలోకి తీసుకువస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

రాష్ట్రంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాం. ప్లాస్టిక్ వల్ల ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటం, విద్యుత్ ఉత్పత్తి లాంటివి చేస్తున్నాం. చెత్త సేకరణ కోసం ట్రై సైకిళ్లు, ఈ-ఆటోలు, వివిధ యంత్రాలను వినియోగిస్తున్నాం. విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రి సహా మరో 5 ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేందుకు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్థాల నిర్వహణలో మన ఆలోచనా తీరు మారాలి. మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి సంక్రమిత వ్యాధులు తడి వ్యర్థాల కారణంగానే వస్తున్నాయి. జపాన్‌లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. అక్కడి పౌరుల తరహాలో మనమూ కొన్ని అలవాట్లను మార్చుకోవాలి అని ముఖ్యమంత్రి సూచించారు.

### రాష్ట్రంలో పెను మార్పులు రాబోతున్నాయి

రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో పెను మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. నేను స్వయంగా కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత పెద్ద సంక్షేమ కార్యక్రమం అమలు చేయడంలో దేశంలోని మరే రాష్ట్రంలోనూ మన దరిదాపుల్లో లేదు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం.

4

# దేవుళ్ల పేరుతో ఆటలాడొద్దు జగన్ !!

- ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు
- వైసీపీ రాజకీయంపై ఎమ్మెల్యే ఇంటూరి ఆగ్రహం
- వైసిపి హయాంలో 300 పైగా ఆలయాలపై దాడులు
- ఎన్నికల ప్రచారంలో శ్రీవారి లడ్డూలను పంచింది మీరుకాదా?
- హిందూ సంస్కృతిని అవమానిస్తే ప్రజలు ఊరుకోరు
- కల్తీనెయ్యితో భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆగ్రహం
- ఇప్పటికైనా తిరుమలవెళ్లి లెంపలేసుకుని క్షమాపణ కోరండి
- మీడియా సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 21)

జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి, భయం లేవు. గడిచిన 5 ఏళ్లలో జగన్‌రెడ్డి హిందూ మతం, సంస్కృతి పై విషం కక్కాడని, దేవుళ్ళ పేరుతో ఆటలాడొద్దని మాజీ ముఖ్యమంత్రి జగన్ ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేసంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 300కు పైగా ఆలయాల పై దాడులు జరిగాయి. రామతీర్థంలో శ్రీరాముల వారి విగ్రహం తల వేరుచేశారు. అంతర్వేదిలో స్వామివారి రథాన్ని తగలబెట్టారు. తిరుమలను రాజకీయాలకు వాడుకున్న దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. వెంకటేశ్వర స్వామిని దర్శించడానికి వెళ్ళినప్పుడు డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయరు. మాడవీధుల్లో చెప్పులేసుకుని తిరిగారు. గత ఎన్నికల ప్రచారంలో శ్రీవారిలడ్డు ప్రసాదాన్ని ఓటర్లకు పంచిపెట్టారు. వై వి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ద్వారా తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీస్తే హిందువుల మనసులు ఎంతో గాయపడ్డాయి. చివరకు వీఐపీ బ్రేక్, సేవా టికెట్లు, ప్రసాదాలు అమ్ముకున్న దుర్మార్గులు వాళ్లు. అన్యమతస్తులను (తరువాయి 4లో...)

# కన్నుల పండుగగా నిర్మమహేశ్వర స్వామి తెప్పోత్సవం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 21)

పట్టణంలోని శ్రీ పార్వతి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి స్థానిక కోనేటిలో తెప్పోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా, కమణీయంగా, కన్నులపండుగగా నిర్వహించారు. తెప్పోత్సవ ఉభయ దాతలు గునుపుడి బ్రదర్స్, పేర్ల శ్రీనివాసరావు బ్రదర్స్ (భవాని గ్రూప్స్) వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ కోనేటిలో తెప్పోత్సవ సేవను ఉభయ దాతలచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, ఈవో నర్రా నారాయణరెడ్డి, కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్‌లు పాల్గొన్నారు. ద్వితీయ వార్షికోత్సవ తేప్పోత్సవానికి పట్టణ ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని తిలకించారు. (తరువాయి 4లో...)

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

## జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, దోర్నాల, ఫిబ్రవరి 21)

ఈ నెల 25వ తేదీన దోర్నాల మండలంలో జరిగబోయే సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని గంటావాని పల్లెలో ఆయన నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామంలోకి వెళ్లే బ్రిడ్జిని విస్తరించాలన్నారు. అదే విధంగా సీఎం హెలిఫ్యాడ్, ఫీడర్ కెనాల్ వద్ద శంకుస్థాపన చేసే పనులు త్వరిత గతిన (తరువాయి 4లో...)





## ఘనంగా మాతృభాషా దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 21)
మండలంలోని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు షేక్ రసూల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సిద్ధం నాగమల్లేశ్వరరావు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అ ఆకారంగా ఏర్పాడి తెలుగు భాషాభిమానాన్ని చూపించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రసూల్ మాట్లాడుతూ ఆంగ్ల భాషను నేర్చుకోవాలి. కానీ, మన మాతృభాష అయిన తెలుగును నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. మాతృభాష తల్లితో సమానమని, పసికందుకు తల్లిపాలు ఎంత ముఖ్యమో, విద్యార్థులకు మాతృభాష అంతే అవసరమని వివరించారు. మాతృభాషను మరువనంత వరకు విద్యార్థులు విజయాల బాటలో విహరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మీయ అభినందన సభలో మండల విద్యాశాఖ అధికారికి సన్మానం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 21)
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొమరోలు నందు నిర్వహించిన ఆత్మీయ అభినందన సభకు ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వర అధ్యక్షత వహించారు. మండల విద్యాశాఖ అధికారి-2 గా విధులు నిర్వహిస్తున్న బొర్రా వెంకటరత్నం రానున్న మే నెలలో పదవి విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా వారి వృత్తిపరమైన సేవలను గుర్తించి ప్రశంసించి శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు, విద్యాసంస్థల ఉపాధ్యాయులు తదితరులు హాజరై దుశ్శాలువతో, పూలమాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, జిల్లా అకాడమిక్ ఫోరం మెంబర్ డాక్టర్ మొర్రి పిచ్చయ్య, విషయ నిపుణులు, సంఘ నాయకులు పాశం. ప్రసాద్, కృష్ణారెడ్డి, యంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొని వీరి సేవలను అభినందించారు.

## సిమెంట్ రోడ్డు వెడల్పు పనులు పరిశీలన



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)
నెల్లూరు రోడ్డు నుంచి విరాట్ నగర్ వరకు సిమెంట్ రోడ్డు వెడల్పు పనులను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏఎంసి ఛైర్మన్ యరవ శ్రీనివాసులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మాజీ సర్పంచ్ సోమిశెట్టి నారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీపాలెం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి

### వార్షిక బ్రహ్మోత్సవాల పుస్తకాల ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 21)
బద్వేల్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం లక్ష్మీపాలెం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పుస్తకాలు, గోడపత్రాలను మాజీ ఎమ్మెల్యే కే విజయమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26వ తేదీన ప్రారంభమై మార్చి 8వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చాటకొండ సత్య సంజీవ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు వెంగల్ రెడ్డి, మెంటా చంద్రయ్య, ఒంటె పేరయ్య, గానుగపెంట శ్రీనివాసులు, రైస్ మిల్లు ప్రసాద్, చెవుల ప్రసాద్, అమర్నాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహక అధికారి రామలింగారెడ్డి, ఆలయ అధికారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆదాయం పెంచుతాం... ఆనందాన్ని పంచుతాం





అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు ద్వారా పేదలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తాం. అన్ని నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. గిట్టుబాటు ధర వచ్చే పంటలనే రైతులు వేయాలని కోరుతున్నాను. వారసత్వంగా వచ్చే పంటలనే పండిస్తే ఆదాయం తక్కువ వచ్చి ఇబ్బందులు వస్తాయి. రైతుకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. ఏఐ ద్వారా వ్యవసాయ నిపుణుణ్ని అందుబాటులోకి తెచ్చి రైతుకు శిక్షణ అందిస్తాం. ఇటీవల బిల్ గేట్స్ రాష్ట్రంలో పర్యటించినప్పుడు మనవాళ్ల టెక్నాలజీ వినియోగాన్ని మెచ్చుకున్నారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తున్నాం. అందులో భాగంగా వినుకొండను కూడా అభివృద్ధి చేస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. మొదట్నుంచీ డ్వాక్రా మహిళలు నాకు అండగా ఉన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేసే బాధ్యత తీసుకున్నాం. సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**పీ4తో పేదలకు ఆర్థిక చేయూత**

సమాజంలో అట్టడుగున ఉన్నవారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పీ4 కింద లక్షమంది మార్గదర్శులు, 10 లక్షల మంది పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అట్టడుగున ఉండే 20 శాతం బంగారు కుటుంబాలు, పైన ఉండే 10 శాతం మార్గదర్శులు కలిసి పనిచేస్తే రేపటి రోజున ఈ బంగారు కుటుంబాలే మార్గదర్శులు అవుతారు. పీ4 ద్వారా 100 కుటుంబాలను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని అభినందిస్తున్నాను. ఈ పథకం ద్వారా మరింతమంది పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు మరికొందరు ముందుకు రావాలి అని సీఎం చంద్రబాబు కోరారు.

**ఢిల్లీలో ఏఐ సదస్సు సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం**

ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సదస్సుకు నేను హాజరయ్యాను. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. సుమారు 60 దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో ఏఐ ఏం చేస్తుందో తెలిపారు. ఢిల్లీలో ఇంతమంచి సదస్సు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ వాళ్లు దారుణంగా ప్రవర్తించారు. ఓవైపు ప్రపంచమంతా టెక్నాలజీలో ముందుకుపోతుంటే.. యువత ప్రయోజనాలు కాపాడాల్సిన పార్టీలు అర్ధనగ్న ప్రదర్శన చేయడం నన్ను బాధించింది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ తరహా శైలి దేశానికి నష్టం చేస్తుంది. మన రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూశాం. ఏపీ అంటే అందరూ ఛీ కొట్టారు. పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు చేశారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే ప్రజలు గొప్ప విజయం అందించారు. కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా వెంటనే ప్రజల కోసం అమలు చేయడం నాకు అలవాటు. 1995లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ కట్టాను. 25 ఏళ్లలో దేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అందుకు మన దూరదృష్టే కారణం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అమరావతిని క్వాంటమ్ వ్యాలీకి చిరునామా చేస్తాం. విశాఖలో భాగస్వామ్య సదస్సు ద్వారా రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. మెగా డీఎస్సీ ద్వారా 15,600 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమిదే. రోడ్ల మరమ్మతులు చేపడుతున్నాం. కరెంటు చార్జీలు పెంచబోం. వినుకొండ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని 1000 పడకల ఆస్పత్రిగా మార్చుతాం. ట్రామా కేర్ సెంటర్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. వినుకొండలో అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. బస్టాండ్ ను ఆధునీకరిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**స్టాళ్ల సందర్శన... ఉత్పత్తుల పరిశీలన**

వ్యర్థాల సేకరణ కోసం వినియోగించే స్వచ్ఛ రథాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. దాచేపల్లికి చెందిన స్వచ్ఛ రథం డ్రైవర్ దుర్గారావు, హోం కంపోస్టింగ్ విభాగంలో లక్ష్మీ గోవిందమ్మను ముఖ్యమంత్రి సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# దేవుళ్ళ పేరుతో ఆటలాడొద్దు జగన్ !!



కూడా ఉద్యోగాల్లో చేర్పించిన ఘనత వైసిపి ప్రభుత్వానిది. అన్నిటికీ మించి కల్తీ నెయ్యితో లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయడం పరమ దుర్మార్గం. దర్యాప్తులో వైసిపి నేతల ప్రమేయం తేలినా, ఇప్పటికీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా చెప్పులు వేసుకుని దేవుడు పటాలు పట్టుకున్నారు. స్వామివారికి దంపతులు వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించే ఆచారాన్ని పాటించకుండా, జగన్ ఒక్కడే వెళ్లడం ఏమిటి ? ఇప్పటికైనా మించి పోయింది లేదు. జగన్మోహన్ రెడ్డి బుద్ధి తెచ్చుకుని, తిరుమల వెళ్లి లెంపలేసుకుని క్షమాపణ కోరాలి. లేకపోతే ఈసారి ఆ 11 సీట్లు కూడా మిగలవని గుర్తుంచుకోండి. కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులకు జగన్మోహన్ రెడ్డి కనీసం అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం చూశాం. మా యువ నాయకుడు లోకేష్ గారు చూడండి... మా కుటుంబాలతో ఎంత ఆత్మీయంగా ఉంటున్నాడో ! ఎంత బాగా మాట్లాడుతున్నాడో ! గతంలో జగన్ దగ్గరికి ఎమ్మెల్యేలు వెళితే ఎంత తెచ్చావు అని అడిగేవారు. ఇప్పుడు మేం వెళితే ఏ అభివృద్ధికి, ఎంత నిధులు కావాలి అని అడిగిమరీ ఇస్తున్నారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు స్పీడ్ గా వెళుతోంది. దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికి వస్తున్నాయి. రాజధాని అమరావతిలో వేలాది మంది కార్మికులు మిషన్లు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి. పోలవరం పనులు స్పీడ్ గా జరుగుతున్నాయి. మరోవైపు వైజాగ్ ఐటీ హబ్‌గా దూసుకుపోతోంది. తిరుమలతో పాటు అన్ని ఆలయాల నిర్వహణ చక్కగా ఉంది. బటన్లు నొక్కే జగన్మోహన్ రెడ్డిని వద్దనుకుని, అభివృద్ధి చేసే చంద్రబాబు నాయుడు పాలనను మరోసారి ప్రజలు కోరుకుంటున్నారని అర్థమవుతోంది. ఈ మీడియా సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


# కన్నుల పండుగగా నిర్మమహేశ్వర స్వామి తెప్పోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, ఆర్యవైశ్య సంఘ నాయకులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



పూర్తి చేయాలన్నారు. గ్రామం నుంచి ఫీడర్ కెనాల్ వద్దకు బీటీ రోడ్డును రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. బస్సులు, ఇతర వాహనాలు నిలిచే స్థలాన్ని వెంటనే శుభ్రం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి వెంట మార్కాపురం ఇంచార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

# చెర్లోపాలెం వద్ద రోడ్డుప్రమాదం బాధితులకు ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 21)
కందుకూరు సమీపంలోని చెర్లోపాలెం వద్ద ఈ మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి, రోడ్డు మార్జిన్ లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నెల్లూరుకు చెందిన దంపతులు, పిసిపల్లి మండలం పెదఇర్లపాడు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి నెల్లూరు వెళుతున్నారు. చెర్లోపాలెం సమీపంలో కారు అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న వెంకట్ ఫుడ్ కోర్ట్ సమీపంలోకి దూసుకెళ్లింది. దంపతులిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. దంపతులను పరామర్శించి యోగక్షేమాలు కనుక్కున్నారు. అనంతరం వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపించారు.








# ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజా ఆరోగ్య దేవాలయాలు

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**
**స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో మార్టూరు ఆసుపత్రి తనిఖీ**
**అభివృద్ధి పనుల పై సమీక్ష, మరింత విస్తరణకు చర్యలు**
**మార్టూరు ఆసుపత్రిలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం**
**బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఎమ్మెల్యే ఏలూరి తనిఖీ**

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు ప్రతినిధి, ఫిబ్రవరి 21)**

ప్రభుత్వాసుపత్రులు ప్రజా ఆరోగ్య దేవాలయాలు...ఇక్కడికి వచ్చే ప్రతి రోగి భరోసాతో రావాలి, నమ్మకంతో వెళ్లాలని,ప్రజలకు ప్రభుత్వాసుపత్రులపై కలిగించి సేవలు అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, పారిశుద్ధ్యం మరియు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులు దేవాలయాలతో సమానం అన్నారు. అక్కడ పరిశుభ్రత, క్రమశిక్షణ, సేవాభావం ఉండాల్సిందేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నాణ్యమైన వైద్యసేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, చెత్తకుప్పలు లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించిన ఆయన, శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి వ్యర్థాల సేకరణ, సెగ్రిగేషన్ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.



బార్కోడ్ ఆధారిత ట్రాకింగ్‌పై ప్రత్యేక దృష్టి...

ఆసుపత్రిలో అమలవుతున్న బయోమెడికల్ వ్యర్థాల బార్కోడ్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పరిశీలించారు. వ్యర్థాలను సేకరించడం నుంచి నిర్ణీత ప్రాసెసింగ్ కేంద్రానికి తరలించే వరకు అనుసరించే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దశలో పారదర్శకత ఉండాలని, బార్కోడ్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అమలవ్వాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు.

రోగులతో మాటామంతీ -- నమ్మకం పెంపే లక్ష్యం...

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వైద్య సేవలు, సిబ్బంది స్పందన, శుభ్రత ప్రమాణాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉంటేనే రోగికి చికిత్స పూర్తయినట్లే. ప్రజలు నమ్మకంతో రావడం మా ప్రధాన లక్ష్యం" అని ఆయన అన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం...

బయోమెడికల్ వ్యర్థాల సెగ్రిగేషన్, సేకరణ, నిల్వ, తరలింపు విధానాలపై పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా చర్చించారు. వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రజారోగ్యానికి ముప్పు తెస్తుందని హెచ్చరించారు.సిబ్బందికి అవసరమైన రక్షణ పరికరాలు అందించాలని అధికారులకు సూచించారు.సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు బాధ్యతాయుత సేవలు అందించాలని స్పష్టం చేశారు.

ఆదర్శంగా మార్టూరు ఆసుపత్రి
అభివృద్ధి పనులపై సమీక్ష

మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. ఉద్యోగులు వైద్యులు సమన్వయంతో పనిచేస్తూ మంచి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. రూ.2 కోట్ల వ్యయంతో నూతన భవనం నిర్మాణం చేపట్టామనిఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. 2024-25 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నర కాలంలో ఆసుపత్రి అభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. రూ.11 లక్షలతో ఆసుపత్రి భవనం మరమ్మత్తులు చేపట్టామని, రూ.10 లక్షలతో ఆసుపత్రి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి ఆవరణంలో రూ.38 లక్షలతో పోస్టుమార్టం భవన నిర్మాణం, రూ.29 లక్షలతో ఆయుష్ (ఆయుర్వేద) డిస్పెన్సరీ నూతన భవనం నిర్మాణ పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే 30 పడకలు ఉన్న ఆస్పత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రోజుకు వెయ్యి మందికి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో పదిమంది కూడా రాని ఆసుపత్రికి అత్యుత్తమ సేవలతో ప్రస్తుతం రోజుకు 300 నుంచి 500 మంది రోగులు వస్తున్నట్లు పేర్కొన్నారు.


పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత....

రాష్ట్రంలో చెత్తకుప్పలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పరిశుభ్రత, సాంకేతికత, బాధ్యతాయుత సేవలతోనే ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలమని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, మార్టూరు ఆసుపత్రిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అధికారులు నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు.

చెత్త రిక్షాలు అందజేత...

మార్టూరు పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ నిమిత్తం నూతన రిక్షాలు,డస్ట్ బిన్లు ఎమ్మెల్యే ఏలూరి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్నెంట్ గార్గేయ, వైద్యులు అశోక్ రెడ్డి, సిద్ధార్థ, కిషోర్ ,ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ ఫరూక్ ,మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, నాయకులు ఆదినారాయణ, జనార్ధన్, రజాక్, జంపని శ్రీనివాసరావు,శివ నాగేశ్వరరావు, శివరాత్రి శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## శనగ పంట కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 21)**

మండలంలో శనగ పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రైతులు తమ శనగలను అమ్మకం కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఓ ప్రకటనలో అయిన మాట్లాడుతూ మండలంలోని చినగంజాం, కడవకుదురు గొనసపూడి, చింతగుంపల్లి సంతరావూరు,పెద్దగంజం, మున్నంవారిపాలెం మొదలగు గ్రామాలలో అత్యధిక విస్తీర్ణంలో శనగ పంట సాగు అవుతుందన్నారు.గత పంట నిలువలు శీతల గిడ్డంగుల్లో పేరుకు పోయి ఉండగా రైతులు కష్టాలను గుర్తించిన ప్రభుత్వం ఈ ఏడాది పంట కొనుగోలు చేయుటకు నిర్ణయించి లక్ష్యం మేరకు మార్క్ఫెడ్ ద్వారా సెనగ పంట కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. తేమశాతం 14% మేరకు క్వింటా మద్దతు ధర 5875 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయంచిందని ఈ పంటలో రైతు నమోదయి ఉంటే సరిపోతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా సీఎం యాప్ లో వివరాలు నమోదు చేస్తే పంటను ఎప్పుడు కొనేది చరవానికి సందేశం వస్తుందని నిర్ణయించిన తేదీ న రైతు తన పంటను అమ్ముకోవచ్చాని తెలిపారు. సదరు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నదంని సోమవారం నుంచి కేంద్రాలు తెరిచేందుకు అధికారులు సూచన చేస్తున్నారు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు శెనగ పంట రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేసారు. రైతులు దళారులు చేతుల్లో మోసుకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్ముకోవాలని సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 21)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న ఎస్ఏఎస్ఏ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఉలవపాడు మండలం భీమవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉలవపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సురేష్ గారి ఆధ్వర్యంలో జీరో వేస్టేజ్, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం అమలు,డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం మరియు నిర్వహణపై కరపత్రాల పంపిణీ, ఐవిఆర్ఎస్ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ మేడిది రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఏ అంజయ్య , గ్రామ టిడిపి నాయకులు జాజుల రవి, గణపతిరాజు వెంకట చలపతిరావు, కాకర్లపూడి వెంకటరామరాజు, కోటిరెడ్డి, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 23 నుంచి ఇంటర్ పరీక్షలు

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 21)**

స్థానిక జూనియర్ కళాశాలలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ జి రాజేంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్ర బాబు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 90 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 78 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. కళాశాల సమీపంలో ఎటువంటి జెరాక్స్ సెంటర్లు ఓపెన్ చేయరాదని, పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు.

## పందిటి హరీష్ నూతన గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)**

పామూరు పట్టణంలో టిడిపి వాణిజ్య విభాగం నాయకులు పందిటి హరీష్ నూతన గృహప్రవేశం వేడుక శనివారం జరిగింది. ఈ వేడుకకు ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీష్ ఇంటని సందర్శించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు తెదేపా బాపట్ల పార్లమెంట్ కార్యాలయానికి శంకుస్థాపన

**నూతన కమిటీ ప్రమాణ స్వీకారంతో పార్టీకి నూతనోత్సాహం**

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు**



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 21)**

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కీలక అడుగుగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ ఆదివారం జిబిసి రోడ్డులో, కొత్త కంకటపాలెం డెఫ్ ఒ డం స్కూల్ సమీపంలో నూతన కార్యాలయ భూమి పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి , రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ, 3వ జోన్ ఇన్‌ఛార్జ్ వేపాటి చిరంజీవిరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు , చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య , సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గంలో పాటు బాపట్ల పార్లమెంటు పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పార్టీకి శక్తినిచ్చే కార్యాలయం.... ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, నూతన కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. "పార్టీ వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే కార్యాలయాల నిర్మాణం, కమిటీల సక్రమ వ్యవస్థ అవసరం అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమం పార్టీకి నూతనోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

క్రమశిక్షణ -- కట్టుబాటు -- సేవాభావం: నూతన కమిటీ ప్రమాణ స్వీకారంతో పార్టీ కార్యకర్తలు మరింత బాధ్యతతో పని చేయాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, పార్టీ సిద్ధాంతాలను బలంగా నిలబెట్టడం కమిటీ ముఖ్య లక్ష్యాలుగా ఉండాలన్నారు.

ఐక్యతే బలం...

పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. ఐక్యతే తెలుగుదేశం పార్టీ బలంమని,బాపట్ల పార్లమెంట్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.బాపట్ల పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాలకు ఈ కార్యక్రమం మైలురాయిగా నిలవనుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

## మాతృభాషను కాపాడుకుందాం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)**

ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది.. తొలుత తెలుగు తల్లి చిత్రపటానికి పలువురు కవులు సాహితీవేత్తలు పుష్పమాలలు వేసి తెలుగు భాషను పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు.... జయహో తెలుగు తల్లి.... తెలుగు భాష వర్ధిల్లాలి అంటూ ఏక కంఠమై నినదించారు. అనంతరం సమాఖ్య గౌరవాధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు పర్యవేక్షణలో జరిగిన సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఉగ్గుపాలతో వచ్చే మాతృభాషను కాపాడుకునేందుకు మనందరం కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు.... భాషా సంస్కృతుల వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగభైరవ కళా పీఠ అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులు తెలుగు భాషలో పట్టు సాధించేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని, తద్వారా భవిష్యత్తులో ప్రపంచ నలుమూలల తెలుగు భాష దేదీప్యమానంగా ప్రజ్వరిల్లుతుందని అన్నారు. ఈ సభా కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు కనుమల రాఘవులు, అంగలకుర్తి ప్రసాద్, యువి రత్నం, గుంటూరు సత్యనారాయణ, పిన్ని వెంకటేశ్వర్లు ఓరుగంటి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు వెంకటేశ్వర్లు, మద్దులూరి వెంకట సుబ్బారావు, వెన్నూరు నాగేశ్వరరావు, తాతా శ్రీనివాసులు, పొదిలి బాల గురవయ్య, ముప్పా నాగేశ్వరరావు, పాత శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న పాపకు అండగా టైలర్స్ అసోసియేషన్

**రూ.45 వేల ఆర్థిక సాయం**

**దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని మనవి**




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 21)

పట్టణంలో టైలర్ గా వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న మండ్ల నారాయణ కుమార్తెకు మెదడు క్యాన్సర్ కావడంతో పాప చికిత్స ఖర్చుల నిమిత్తం యర్రగొండపాలెం టైలర్స్ అసోసియేషన్ సభ్యులు వారికి అండగా నిలిచారు. రూ.45,000ల నగదును అసోసియేషన్ కార్యాలయంలో నారాయణ కు అందించారు. అలాగే మంచి మనసుతో దాతలు కూడా ముందుకు వచ్చి పాప చికిత్స ఖర్చులకు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సొసైటీ పరిరక్షణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోకూరి సుబ్రహ్మణ్యం, టౌన్ అధ్యక్షులు గుంటూరి వెంకటాచారి, గౌరవ అధ్యక్షులు షేక్ మహమ్మద్ సాహెబ్, సెక్రెటరీ షేక్ ఇస్మాయిల్, వైస్ ప్రెసిడెంట్ షేక్, మస్తాన్ వలి, షేక్ ఖాసిం, మాజీ అధ్యక్షులు ఓర్సు వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు మస్తాన్ బి, సుబ్రహ్మణ్యం, మస్తాన్ రెడ్డి, షేక్ ఇస్మాయిల్, రమణ, తదితరులు పాల్గొన్నారు...

## అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి రూరల్, ఫిబ్రవరి 21)

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పిఎమ్ శ్రీ ఆదర్శ పాఠశాల కనిగిరి, పిఎమ్‌శ్రీ ఆదర్శ పాఠశాల కనిగిరి నందు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా తెలుగు ఉపాధ్యాయ బృందం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఎందుకు జరుపుకుంటారో విద్యార్థులకు తెలియచేసారు. మాతృభాషాభిమానం అందరికీ అత్యంత అవసరం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని భాష లో సమానమే అయితే ప్రతి ఒక్కరూ మాతృ భాషకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఇటీవల విడుదలైన పరాశక్తి అనే తమిళ సినిమా మాతృ భాషకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో తెలియచేసిందని, మన సంస్కృతీ సంప్రదాయాలు మాతృ భాష ద్వారానే ఒక తరం నుండి ఇంకొక తరానికి అందుతాయని అందుకే ప్రతి ఒక్కరూ మాతృ భాషాభిమానం తప్పక కలిగి ఉండాలని తెలియజేసారు.

**మాతృభాషలో అలరించిన విద్యార్థులు**

ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన తెలుగు పద్యాలు, పాటలు, ఉపన్యాసాలు అందరినీ అలరించాయి. విద్యార్థులు అడిగిన పొడుపు కథలు, సామెతలు, జాతీయాలు, రెండు నిముషాలు ఆంగ్ల పదాలు దొర్లకుండా మాట్లాడడం వంటివి అందరినీ ఉత్సాహ పరిచాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయు లందరూ పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని చాటి చెప్పారు.

## క్రమశిక్షణ.. దానగుణం.. భక్తికి ప్రతీక రంజాన్ మాసం

**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

క్రమశిక్షణ, దానగుణం, భక్తికి ప్రతీక ఈ రంజాన్ మాసం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా టిడిపి మైనారిటీ సెల్ ప్రచురించిన రంజాన్ మాసం ఉపవాసం కేలండర్‌ను శనివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ ఈ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో పాటించి, అల్లాహ్ దీవెనలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రంలో సర్వమత సామరస్యం వెల్లివిరియాలని, ప్రతి ఇంటా రంజాన్ శుభ వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, నగర అధ్యక్షులు బండారు మదన్, టీవీ శ్రీరామ్ మూర్తి, గుంటూరు రాంబాబు, బొడ్డపాటి వెంకట్, షేక్ సిలార్, మహమ్మద్ ఖాన్, అహ్మద్ ఖాన్, అక్బర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం











(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 21)

పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చీరాల పట్టణంలో శనివారం జరిగింది. రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. వ్యర్థ రహిత పాలన అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వీధులలో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. మార్గమధ్యంలో టిఫిన్ సెంటర్ లు, హోటళ్ల వద్ద పరిశుభ్రతపై నిర్వాహకులకు ఆర్డీవో టి.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. అనంతరం సమైక్యతను చాటుతూ పాఠశాలలో మానవహారం నిర్వహించారు. నా ఇంటిని, పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుతానంటూ అందరి చేత ఇంచార్జి కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 26వ తేదీన రేపల్లెలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రాలను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ భావన వశిష్ట విడుదల చేశారు. మీ ఇల్లు శుభ్రంగా ఉంచు కున్నట్లుగానే వీధులను శుభ్రంగా ఉంచాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ భావన వశిష్ట చెప్పారు. మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. అభివృద్ధి చెందే దేశాల సరసన భారత్ నిలిచిందన్నారు. అభివృద్ధి లక్ష్యంగా స్వచ్ఛత, పరిశుభ్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలు వేరు చేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా రేపటి పౌరులుగా ఎదిగే నేటి విద్యార్థులు పరిశుభ్రతపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలన్నారు. వ్యర్థ రహిత పాలనకు ప్రజలంతా సహకరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ చెప్పారు. సింగిల్ యూస్ నిషేధం పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా వినియోగిస్తే జరిమానాలు విధించాలన్నారు. బయట మార్కెట్లో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై అందరూ కలిసి పని చేయాలన్నారు. మన ఇంటిని మాదిరిగా మన వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు పారిశుద్ధ్య కార్యక్రమాలలో భాగస్వాములు కావాలన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలపై చిన్నారుల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులకు సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చీరాల మున్సిపాలిటీ కమిషనర్ కే డానియల్ జోసెఫ్ తెలిపారు. వాణిజ్య సంస్థలు, హోటళ్లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలన్నారు. లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందు కొరకే ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి సుబ్బయ్య, సిపిఓ షాలేము రాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ మాధవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియేట్ పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు



**ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

**జిరాక్స్ సెంటర్లు మూసివేత**

**పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు**

**మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం12 గంటల వరకు నిర్వహించు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలియచేసారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఆర్మ్ గార్డులను పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు నిఘా ఉంటుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ గారు ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు ఇతర శాఖల సమయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోరని, కావున దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

## వృధా వద్దు-సద్వినియోగమే ముద్దు

(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 21)

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పట్టణంలోని వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో నోడల్ ఆఫీసర్ సిహెచ్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ప్రకృతి వనరులు సమృద్ధిగా




ఉన్నప్పటికీ వాటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఒకసారి వినియోగించిన వస్తువులను వ్యర్థాలుగా పారేయకుండా, మళ్లీ ఉపయోగించుకునే మార్గాలను అన్వేషించాలని, తద్వారా భావితరాలకు ప్రకృతి వనరుల కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. నోడల్ ఆఫీసర్ సి.హెచ్. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని, ప్రమాదకరమైన ప్లాస్టిక్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 21)

ప్రముఖ పుణ్యక్షేత్రం, వలేటివారిపాలెం మండలంలోని మాలకొండపై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పండితులు, అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దర్శన ఏర్పాట్లు చక్కగా ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ ప్రసాద్ కు ఎమ్మెల్యే సూచించారు. పలువురు భక్తులతో మాట్లాడి వసతుల గురించి వాకబు చేశారు. అన్న ప్రసాదం స్వీకరించడంతో పాటు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, శనివారపు మాల్యాద్రి, కామినేని అశోక్, గొర్రెపాటి శ్రీను, తదితరులు ఉన్నారు.

# వర్గ పోరాటం ద్వారానే సామ్రాజ్యవాదాన్ని ఎదిరించగలం

## రెడ్ బుక్స్ డే సందర్భంగా స్టడీ సర్కిల్ లో వక్తల పిలుపు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

వర్గ పోరాటం ద్వారానే సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను సమర్థంగా ఎదుర్కొనగలమని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. రెడ్ బుక్స్ డే పురస్కరించుకొని శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సామ్రాజ్యవాదం అంశంపై స్టడీ సర్కిల్‌ను నిర్వహించారు. సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు మాట్లాడారు. దేశంలో సామ్రాజ్యవాద విధానాలు మరింతగా విస్తరిస్తున్న తరుణంలో వాటికి వ్యతిరేకంగా పోరాటాన్ని క్రింది స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని ఎదిరించాలంటే సిద్ధాంతపరమైన స్పష్టతతో పాటు కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచే దిశగా పార్టీ శ్రేణులు చైతన్యవంతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను క్రింద దాకా తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. పాఠ్యాంశాన్ని బోధించిన సిపిఎం సీనియర్ నాయకులు వై సిద్దయ్య మాట్లాడుతూ, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలే ప్రపంచ పురోగమనానికి అడ్డంకని దాని వల్ల నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తీవ్రరూపం దాల్చుతున్నాయని విశ్లేషించారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రజల వనరులు వినియోగించబడుతున్నాయని, దీని ప్రభావం కార్మికులు, రైతులు, మధ్యతరగతి వర్గాలపై తీవ్రంగా పడుతోందన్నారు. సమసమాజ స్థాపన దిశగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని బలపర్చాలని సూచించారు. అధ్యక్షత వహించిన జివి కొండారెడ్డి మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలక వర్గాలు ప్రజల సంపదను సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. ఈ దోపిడీ వ్యవస్థను ఎదుర్కొనాలంటే ప్రజా పోరాటాలను నిర్మించాలని, పార్టీ శ్రేణులు సిద్ధాంతపరమైన అధ్యయనం పెంచుకొని ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కమిటీ కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటి సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు సాగాలి

## జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 21)

పట్టణాల్లో పరిశుభ్రత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. మార్కాపురం పట్టణంలోని కళాశాల రోడ్డులో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తుందని దాన్ని ప్రజల సహకారంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేపట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ వస్తువుల అనర్థాలను తెలుసుకోవాలన్నారు. వీటిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రానికి తెచ్చి ఇవ్వాలని కోరారు. వీటికి సైతం కొంత నగదు చెల్లించడం జరుగుతుంది అన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం పై ప్రత్యేక దృష్టి పెట్టారని దానికి అనుగుణంగా అందరు పని చేయాలని సూచించారు. ముఖ్యంగా శుభ్రతకు ప్రాధనత ఇచ్చి కలుషితం లేని నగరాలు, పట్టణాలుగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, ఇతర తెదేపా నాయకులు పాల్గొన్నారు.







## 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266.50 మాత్రమే

## జిల్లాలో 7423 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 21)

బాపట్ల జిల్లాలో రబీ సీజన కు సంబంధించి 7423 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటు లో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజను కు సంబంధించి 7423 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రబీ సీజన్ కు సంబంధించి నేటి నుండి రాబోయే 21 రోజులకు గాను 7423 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉదన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో 1371 మెట్రిక్ టన్నులు, రైతు సేవ కేంద్రాలలో 622 మెట్రిక్ టన్నులు, జిల్లా సహకార మార్కెటింగ్ సోసైటీలలో 162 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ రిటైల్ వ్యాపారుల దగ్గర 2289 మెట్రిక్ టన్నులు మార్క్ ఫెడ్ గోదాములలో 2734 మెట్రిక్ టన్నులు టోకు వ్యాపారుల దగ్గర 216 మెట్రిక్ టన్నులు కంపెనీ గోదాములలో 29 మెట్రిక్ టన్నుల యూరియా, ఎరువులు రైతాంగానికి అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, 45కిలోల యూరియా బస్తా ధర రూ.266.50. యూరియాను ధరకు మించి విక్రయించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## భవిష్యత్తులో ఈ ప్రాంత విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ 1 ఉద్యోగాలు పెద్ద ఎత్తున సాధించాలి

### ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 21)



పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రూప్ 1కి సెలెక్ట్ అయిన అభ్యర్థులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు రమణ, సిపిఐ నాయకులు అందె నాసరయ్య, మీడియా ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యాపరంగా, ఉద్యోగాల పరంగా గతంలో ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉండేదని కానీ ఈ ప్రాంతం నుండి గ్రూప్1 అభ్యర్థులుగా ఎంపికైన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. నూతనంగా ఏర్పడిన మన మార్కాపురం జిల్లాలో త్వరలోనే మంచి విద్యాసంస్థలు ఏర్పాటు జరుగుతాయన్నారు. తద్వారా ఈ ప్రాంత యువకులు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు అయిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, గ్రూప్ 1 ఉద్యోగాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మార్కాపురం పట్టణంలో మంచి లైబ్రరీ ఏర్పాటు చేయబోతున్నామని, దానికి తన వంతుగా అన్ని రకాల సహాయం చేస్తానని అన్నారు. అదే విధంగా ఈ ప్రాంతం నుండి గ్రూప్1 కి సెలెక్ట్ అయిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు.






## తాగునీటి పైపులైనును వెంటనే పునరుద్ధరించాలి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 21)

పగలగొట్టిన పైపులైను వెంటనే పునరుద్దరించి రామకృష్ణ పురం ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలని స్థానిక బిపిసియల్ ఆఫీస్ వద్ద జరిగిన నిరసనలో 139 బిసి కులాల రాష్ట్ర జెఎసి చైర్మన్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బిపిసిల్ సిబ్బంది తమ పనుల కోసం కరేడు నుండి రామకృష్ణ పురం కు వెళ్ళే త్రాగునీటి పైపులైను ద్వసం చేశారు. దీనివలనా రామకృష్ణ పురం ప్రజలు గత పది రోజుల నుండి త్రాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయితీలో ఫిర్యాదు చేసినా వారు ఇంతవరకు బిపిసియల్ సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని పైపులైను పునరుద్దరించాలి. లేనిచో ఒంగోలు కలెక్టరేట్ దగ్గర బారీఎత్తున నిరసన తెలియజేస్తాం అని శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మహిళలు ఖాళీ బిందెలలతో బారీఎత్తున పాల్గొన్నారు.

## కంభం పోలీస్ క్వార్టర్స్‌లో శుచితా కార్యక్రమం

### నిర్వహించిన ఎస్ఐ శివ కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 21)

కంభం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి శుచితా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కంభం పంచాయతీకి చెందిన శానిటరీ కార్మికులు పాల్గొన్నారు. పోలీస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కాలువలు మరియు మూలల్లో ఉన్న మురుగును శుభ్రపరచడం, మొక్కల చుట్టూ పెరిగిన అడవి మొక్కలను తొలగించడం వంటి పనులు చేపట్టారు. అదేవిధంగా, పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రజలకు కూడా పారిశుధ్యం పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీస్ సిబ్బందిపై ఉందని ఎస్సై శివ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ శుచితా కార్యక్రమం ద్వారా పోలీస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతం పరిశుభ్రంగా మారడంతో పాటు, సిబ్బందిలో శుభ్రతపై మరింత చైతన్యం పెరిగిందని అధికారులు తెలిపారు.

## నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)

పామూరు పట్టణంలో శనివారం అనిల్ గార్డెన్ నందు పత్తి మహంత్ పృథ్వి, పులి శిరీష నిశ్చితార్థ వేడుకల్లో ఆకుపాటి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గద్దె సుధాకర్, రేనాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి








(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి పేర్కొన్నారు. శనివారం జరుగుమల్లిలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు గౌరవ శ్రీ నారా చంద్రబాబునాయుడు పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నదని, ఫిబ్రవరి నెల థీమ్ అని, ప్రజల ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, గ్రామం పరిశుభ్రత పైనే ఆధారపడి ఉందని తెలియజేశారు. స్వచ్ఛ రథం ప్రారంభించి ప్రజలకి అవగాహన కలిగేలా ఇంటింటికి తిరిగి పొడి చెత్తను ఈ వాహనానికి ఇచ్చి నిత్య అవసర సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. ఈ ఒక్క రోజే కాకుండా ప్రతి రోజు పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వంతోపాటు ప్రజల భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధికి కోసం కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని మంత్రి చెప్పారు.అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి 20 వేల చొప్పున నగదు రైతుల ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లుల ఖాతాలలో



నగదు జమచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. యువ శక్తి పథకం కింద 16 వేల ఉపాధ్యాయుల ఉద్యోగాలు ,6 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు తోపాటు పారిశ్రామిక పెట్టుబడులు తేవడం ద్వారా 16 లక్షల మందికి ఉంద్యోగాలకి అవకాశాలు కల్పించామన్నారు. గ్రామీణ రోడ్లు నిర్మాణం కొరకు ఈ 20 నెలల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు 56 కోట్ల రూపాయలు రోడ్లు , ఆర్ ఆబి శాఖ ద్వారా సుమారు 30 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. సంగమేశ్వరం ప్రాజెక్టుకి 167 కోట్లు పరిపాలన అనుమతులు ఇస్తూ,25 కోట్ల రూపాయలు బడ్జెట్లో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఇది మంచి శుభపరిణామన్నారు. వెలుగొండ తూర్పు కాలువ నుంచి పాలేరు నుంచి 0.6 టి.ఎం.సి ల నీటిని కేటాయించడం జరిగిందని మంత్రి చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్నటువంటి నిర్ణయాలకు అనుగుణంగా ప్రజలందరూ పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని తెలియజేశారు . గ్రామ పంచాయతీ పరిధిలో పరిశుభ్రత, ప్రజారోగ్యం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు జీవో వేస్ట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చెత్త ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను తప్పనిసరిగా వేరు చేసి సేకరించారు. ఈ సందర్భంగా హరిత రాయబారులకు వారు చేస్తున్న సేవలకు వారిని గుర్తించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి చిరంజీవి, డిఎల్‌పిఓ ఆర్ పద్మ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


### ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శన

జరుగుమల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన సందర్శించారు. త్వరలో జరగబోవు 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఉత్తీర్ణతతోపాటు మంచి ర్యాంకులు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకి మంచి భవిష్యత్ కి పునాదులు వెయ్యటానికి విద్యా వ్యవస్థ లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు.

---


# పేదలకు వైద్యం, విద్య పట్ల కూటమి ప్రత్యేక శ్రద్ధ సంక్షేమం అమలులో దేశానికే ఏపీ రోల్ మోడల్

## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 21)

పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యను అందించడంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకిలో మంత్రి గొట్టిపాటి శనివారం పర్యటించారు. పుట్టావారి పాలెంలోని అతిథి గృహంలో 85 మంది లబ్ధిదారులకు మంత్రి గొట్టిపాటి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను, పేదలకు కార్పొరేట్ వైద్యాన్నిఅందిస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బలహీన వర్గాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఆస్పత్రుల ఖర్చుతో ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకూడదనే, ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఇటువంటి ఎన్నో కార్యక్రమాల నిర్వహణతో, పేదలకు సంక్షేమాన్ని అందించడంలో దేశానికే ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్ గా నిలుస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ., స్వార్థ రాజకీయాల కోసం దేవుడిని కూడా వాడుకుంటున్న నీచ చరిత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీది అని విమర్శించారు. చట్ట సభల్లో దేవుడి ఫొటోతో రాజకీయ నినాదాలు చేయడం దేశంలోనే ఇంత వరకు ఎక్కడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానాలను ప్రజలు కూడా ఉపేక్షించరని ఆయన హెచ్చరించారు. మహాపచారం చేసి కూడా బుకాయించడం కేవలం వైసీపీ నేతలకు మాత్రమే చెల్లుతుందని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. ఏదేమైనా వైఎస్సార్ కాంగ్రెస్ పాపాలను భరించడానికి ప్రజలెవరూ సిద్ధంగా లేరని మంత్రి స్పష్టం చేశారు.

---

## ఎస్ఎస్ఎన్‌లో ముగిసిన ఆటల పోటీలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

మంగమూరు రోడ్డులోని డిగ్రీ కాలేజీలో 27వ తేదీన జరిగే కాలేజీ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన ఆటలు పోటీలు శనివారంతో ముగిసాయని చైర్మన్ యల్లటూరి రామకృష్ణా రెడ్డి తెలియచేసారు. ఇంకా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకి చదువు తో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని, అవి మానసిక ఉల్లాసనికి దోహద పడతాయని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వై సత్య నారాయణరెడ్డి మాట్లాడుతూ కాలేజీ లోస్టూడెంట్స్ అందరు క్రికెట్, కబడ్డీ, కోకో, వాలి బాల్ వంటి గేమ్స్‌లో పాల్గొన్నారని, ఈ కాలే జీలో చదువుతో పాటు గేమ్స్, యూత్ ఫెస్టివల్ ప్రోగ్రాం, ఎన్ఎస్-ఎస్ కార్యక్రమాలు అన్ని మా కళాశాలలో జరుపుకోవడం ఆన వాయతి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ టి రాజశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేంద్ర బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు సేవల పై కళాజాత




(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 21)

చిన్నగంజాం మండలం రామచంద్రానగర్ గ్రామం నందు శనివారం చిన్నగంజాం అంధ్రప్రదేశ్ గ్రామీణ భ్యాంక్ మేనేజర్ కె.మధుసూదనరావు ఆధ్వర్యంలో ఖాతాదారులకు, గ్రామస్తులకు అందిస్తున్న బ్యాంకు సేవలపై కళాకారులతో అవగాహన కళాజాత నిర్వహించారు. ఈ బృందం ద్వారా బ్యాంకు సేవలను గురించి గ్రామస్తులకు ఏలా వినియోగించాలో నాటక, పాటల ద్వారా అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ సేవల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు సంస్థల వద్ద డిపాజిట్లు చేసి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంకుల్లో మాత్రమే ప్రజలు డిపాజిట్లు చేసుకుంటే భద్రమన్నారు. భారత ప్రభుత్వం ఖాతాదారులకు జీవన్ జ్యోతి భీమాయోజన పథకం, సురక్ష భీమా పథకం, అటల్ పింఛన్ యోజన, జనరల్ ఇన్సురెన్స్ పథకాలను అందిస్తుంది అని వాటి గూర్చి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు కె.మధుసూదనరావు, బి.పోతురాజు, ఎన్.శిరిషా, టి.నాగపణేంద్ర, షేక్ జాన్ బేగం,మురళి సింగ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు ఆకుపాటి




(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)

పామూరు పట్టణం నందు శనివారం తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు పందిటి హరీష్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆకుపాటి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గద్దె సుధాకర్, గుత్తి అనీల్, ఆకుపాటి లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)**

అనారోగ్య కారణాల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి తెలిపారు. శనివారం తూర్పు నాయుడుపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థికంగా చితికిపోకూడదని, ప్రభుత్వం వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. ఈ రోజు కొండేపి నియోజకవర్గంలో 58 మందికి 31 లక్షల 53 వేల 987 రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఇచ్చామని,ఇప్పటి వరకు మొత్తం 1524 మందికి 12 కోట్ల 2 లక్షల 56 వేల రూపాయలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో కొండేపి నియోజకవర్గానికి సహకారం అందించిన ముఖ్యమంత్రి గారికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.వైద్యానికి ఖర్చు పెట్టి కుటుంబాలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల తో వైద్య బీమా సదుపాయాన్ని తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. బిల్ గేట్స్ సహకారం తో సంజీవిని పథకాన్ని ప్రారంభించబోతున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టులో ప్రజలందరి ఆరోగ్య రికార్డ్స్ ఆన్లైన్ చేస్తామన్నారు. దీని ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి వైద్యం చేసి ప్రాణాలు కాపాడే విధంగా ఈ సంజీవిని పథకం ఉపయోగపడుతుందన్నారు.ఇప్పటికే కుప్పంలో 60 వేల మందికి ఈ పథకం అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ఆనందంగా ఉంటుందన్నారు.

**చెమ్మగిల్లిన మంత్రి కళ్ళు**

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ సమయంలో కొండేపి కి చెందిన బాసకరుని శేషమ్మ కన్నీరుమున్నీరు అయ్యారు. తన భర్త బాసకరుని సుబ్బారావు 5 నెలల క్రితం ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించడం జరిగిందనీ అప్పటి నుండి తన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని ఇప్పుడు మీ సహకారం తో ముఖ్యమంత్రి సహాయనిధి రావటం కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆమె చెప్పటంతో మంత్రి కళ్ళు చెమ్మగిల్లాయి. ఈ సంఘటన ప్రత్యక్షంగా చూసిన అక్కడున్న ప్రజలు ఇంత మంచి మంత్రి తమ నియోజకవర్గానికి ఉండటం తమ అదృష్టమని చెప్పారు.

## భారతదేశం అభివృద్ధి చెందుతుంటే కాంగ్రెస్‌కు కడుపు మండుతుంది

### బీజేవైఎం స్టేట్ ఎడ్యుకేషన్ నెంబర్ కొలిశెట్టి పవన్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 21)**

ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో భారతదేశం అన్ని దేశాలతో పోటీపడి అభివృద్ధి చెందుతుంటే మనదేశంలో ఉన్న కాంగ్రెస్ వారికి మాత్రం ఈ చర్యలు కడుపు మండిస్తున్నాయని బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొలిశెట్టి పవన్ కుమార్ అన్నారు. శనివారం ఢిల్లీలో భారతదేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కు అన్ని దేశాలు మద్దతు తెలుపుతుంటే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్న పరదర్శన నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సదస్సుకు దాదాపు 100 మంది కంటే ఎక్కువ ప్రతినిధులు 25 దేశాల 20 దేశాలు నేతలు ఇతర ముఖ్య సిబ్బంది కలిఫాపై సదస్సును బుర్జ్ ఖలీఫాపై సదస్సును నిర్వహిస్తూ సాంకేతికతను ప్రపంచానికి చాటి చెబుతోంది అన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి చర్యలను స్వాగతించాల్సింది పోయి కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడం వారికి తగదని ఆయన ఎద్దేవా చేశారు. రాబోయే రోజులలో భారతదేశం ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టారాజ్యంతో పనులు చేస్తున్న కాంట్రాక్టు





**(షణ్ముకు వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 21)**

పోరుమామిళ్లలో నడిబొడ్డున బస్టాండ్ కు దగ్గరలో పంట కాలవ గురించి తవ్విన కాలువను 24 గంటలు గడవకముందే కాంట్రాక్టర్ పూడ్డి వేశాడని ప్రజలు చెబుతున్నారు. కనీసం క్యూరింగ్ కూడా చేయకుండా ఆ పంట కాలువకు పోయే కాలవను కాంక్రీట్ తో నింపి ఎటువంటి కడ్డీలు వేయకుండా నాసిరకంగా నిర్మిస్తున్న, ఎక్కడ చూసినా క్వాలిటీ లేని డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లు పోతున్నారని వాపోయారు. అధికారులు వారి జేబులకు అందాల్సిన వాటి పైన ఉన్న శ్రద్ధ నాణ్యమైన కాలువల నిర్మాణాలు చేపట్టని కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడతున్నారని ఆరోపిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారి కుర్చీలకే పరిమితమయ్యారు. ప్రతి నిత్యం వేలాది మంది ఆ ప్రాంతాల్లో తిరుగుతుని ఇబ్బంది పడుతున్నారు. కాలువను రాత్రిపూట తీసి పైపులు వేసి నాసిరకమైన కాంక్రీట్ వేసి 24 గంటల లోపే పూడ్చి వేశారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తణక్షమే కాంట్రాక్టర్ వేసిన కాలువలను స్వయంగా పరిశీలించి ప్రజలు, వ్యాపారస్తులను విచారించి నాసిరకం కాలువలు వేసిన సదరు కాంట్రాక్టర్, చూసిచూడనట్లు వ్యవహరించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యుడు ఫణిరావు, ప్రజలు కోరుతున్నారు. తక్షణమే క్వాలిటీ కంట్రోల్ వారు అందరూ వచ్చి ఇలాంటి నాసిరకమైన వర్కును చూసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నగరంలో ఎస్ఎఫ్ఐ నాయకుల దిష్టిబొమ్మ దగ్ధం

## దగ్ధం చేసిన ఏబీవీపీ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)**

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థి సంఘాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. గడిచిన కొద్ది రోజులుగా ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొని ఉంది. ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్ లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఒంగోలు నగర శాఖ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పేరుతో తయారుచేసిన దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. దీంతో పోలీసులు ఏబీవీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు.. అనంతరం పోలీసులు లకు ఏబీవీపీ నాయకులకు తోపులాట జరిగింది పోలీసులు ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్ కి తరలించారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్తల పైన జరిగిన దాడిని ఖండిస్తున్నామని దాడులకు పాల్పడిన ఎస్ఎఫ్ఐ నాయకులను వెంటనే శిక్షించాలని అదేవిధంగా వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేంద్ర, జిల్లా కన్వీనర్ గురునాథ్, నాగ చరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.









## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు

### కోడిపందెం ఆడుతున్న స్థావరం పై పోలీసులు దాడులు అదుపులోకి 8 మంది



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్బాషా మరియు సిబ్బంది కలసి చీమకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోనుగుంట గ్రామ పొలాలలో కోడిపందెం స్థావరంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి కోడిపందాలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 6 మోటార్ సైకిళ్లు, 9 సెల్ ఫోన్లు, ఐదు కోళ్ళు, రూ.29500 నగదు స్వాధీనం చేసు కున్నారు. జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమా లకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

## మన ఊరి బడిని కాపాడుకుందాం ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం







**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 21)**

కొమరోలు టౌన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు యూటీఎఫ్ కొమరోలు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన "ఊరి బడిని కాపాడుకుందాం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు, పద్మజ, జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య లు పాల్గొని ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం, మన ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో యూటీఎఫ్ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన ఊరి బడిలో మన విద్యార్థులను చేర్చుకొని పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఉచిత మధ్యాహ్నం భోజన వసతి, ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు బుక్స్, ఉచిత యూనిఫాం, బూట్లు, బెల్టు మొదలైనవి అందిస్తూ, తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశా లలో వారి పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంఘ బాధ్యులు బాలయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జనార్ధన రాజు, షరీఫ్, తదితరులు పాల్గొని పోస్టరును ఆవిష్కరించారు.

## వేగినాటి కోటయ్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే కేపి



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 21)**

యర్రగొండపాలెంలో స్వర్గయ వేగినాటి కోటయ్య సతీమణి వేగినాటి కాశమ్మని వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కేపి కొండారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ వేగినాటి కోటయ్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వీరి వెంట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.